# మరుగుపడిన మానవత్వం



పి. వెంకటనరసారెడ్డి

అది సంధ్యాసమయం. పక్షులు, ఆఫీసు పక్షులూ గూళ్ళకెళ్ళేవేళ. వాళ్ళముఖాల్లో ఒకరోజు గండం గడిచిపోయిందనే ఉత్సాహం. రోజంతా కష్టించినా పొట్ట గడవని కూలీలు ఇంకా రోజు కుంటూ రోడ్లమ్మటే తిరుగుతూనే ఉన్నారు.

పొద్దున్నే ఆఫీసుకెళ్ళే తొందరలో భోజనం సమయానికి వండలేదని, వడ్డించలేదనో- చిరిగి పోయిన చొక్కాలు, ఊడిపోయిన ఫాంటుగుండీలు కుట్టలేదనో- కలం, దువ్వెనా కనిపించలేదనో పెండ్లాలతో తగవులేసుకొని ఆఫీసులకెళ్ళిన జీత గాళ్ళు మళ్ళీ తమ శ్రీమతుల అలకతీర్చేందుకు చేతుల్లో పువ్వులూ, పండ్లూ తీసుకెళుతున్నారు. కొందరు పెండ్లికాని (పెండ్లిచేసుకోలేని) బ్రహ్మచారి గుమాస్తాలు, పీవన్లు బస్టాపు అందుకోవాలనే తొందరలో సిటీబస్సు మాటిమాటికీ ఆగుతుంటే గొణుక్కుంటున్నారు. ఇండ్లవద్ద చంటిపిల్లల్ని ముసలాళ్ళ కప్పగించి పొట్టకూటికోసం కార్యాలయాల కెళ్ళిన తల్లుల చెవుల్లో తమ పిల్లలఏడ్పులు, ముసలివాళ్ళ కసరింపులూ వినిపిస్తూంటే దాచినా దాగిపోని మాతృత్వాన్ని కనురెప్పలమాటున అణచిపెట్టి అతిత్వరలో ఇల్లు చేరాలని ఆత్రత చెందుతున్నారు.

ఆలాంటి సమయాన - మౌంటురోడ్డుకు దక్షిణ వైపుగా జెమినీ స్టూడియోకు ఇంకా అవతలగా, అనాథ బాల బాలికల శరణాలయానికి సమీపంలో ఫుట్‌పాత్‌పై పశువుల పెంటకుప్ప. ఆ కుప్పల నుండి స్రవించే కుళ్ళు నీళ్ళపై ఈగలు దోమలు ఝుమ్మని వాలి ఉన్నాయ్. అక్కడే మక్కెలిరిగినేల కొరిగిన బక్కదున్నపోతులా రంగుమాసిన డొక్కు కారు. దాని పక్కనే గోడకున్న సినీ వాల్‌పోస్టరు పెరికి పెంట కుప్పపై పరచుకొని, నేలకు కరుచుకొని బోర్లగిలా పడియుంది. ఓ ముప్పైయేళ్ళ ముదుసలి, తల కాకి గూడులా ఉంది. వీపు తన పేదరికాన్ని నగ్నంగా చూపుతూ బక్కగా ఎండిపోయిన వట్టి చేపలా ఉంది. ఇంతకీ ఆమె వంట్లో ఊపిరి ఉందో లేదో ఆ దేవుడికే ఎరుక!

ఆమె వీపు పైకి పాలకోసం పందిపిల్లలా ప్రాకి ప్రాకి ఆకలితో విసిగిపోయి ఆక్రోశంగా నోరు తెరచుకొని బావురుమని ఏడుస్తున్నాడొక కుర్ర కూన. వాడి ఆకలి అరుపులకు కన్నతల్లి హృదయమే కరగనప్పుడు ఇక ఇతరుల సంగతి చెప్పనేల.

ఫుట్‌పాత్ కింద సైడు కాలువలో పామునోట్లో కప్ప కీ...చు మంటూ అరుస్తోంది. పిల్లవాడు ఆ భీకర శబ్దానికి భయపడ్డాడేమో! మెల్లగా జోగాడుతూ ఆ కుళ్ళును దాటుకుంటున్నాడు. ఫుట్‌పాత్ దిగి రోడ్డులోకి వచ్చాడు. ఇటువైపునుంచి నడిచి పోతున్న ఓ స్కూలు మాస్టారు రోడ్డులో పిల్లవాణ్ణి చూశాడు. అయ్యో! ట్రాఫిక్‌లో నలిగిపోతాడే అనుకున్నాడు. కాని... మలం పూసుకొని మసి గుడ్డలా ఉన్న వాణ్ణెత్తి ఫుట్‌పాత్‌పై చేర్చడం తన మాష్టర్‌గిరికి అన్యాయం చేసిన వాణ్ణౌతాననేమో, ముఖం ప్రక్కకి తిప్పి వెళ్ళిపోయాడు.

అటువైపునుండివచ్చే టాక్సీ ఆగింది. కాని... బొంబేఎక్స్‌ప్రెస్ సెంట్రల్ చేరుకుంటుందనే తొందర్లో సమయానికి చేరకపోతే గిరాకీ చేజారి పోతుందని పిల్లవాడికి పక్కగా టాక్సీ నడిపించుకొని వెళ్ళిపోయాడు. పిల్లవాడు మృత్యువుకు దగ్గరగా... ఇంకా దగ్గరగా...రోడ్డుమధ్యగా పాకుతున్నాడు. దూరంనుండి వాయువేగంతో నల్లకారు పిల్లవాని వైపుకు దూసుకొస్తోంది. ఇటునుంచి పరుగెత్తే స్కూటర్లో హస్బెండును హత్తుకొన్న యువతి ఒక్కసారి "అయ్యో!" అంది. ఆ రెండక్షరాలూ గాలికి ఎటో ఎగిరిపోయాయి. నల్లకారు సర్ర్... ర్...ర్ మంటూ సడన్ బ్రేకు వేసింది. అయినా ప్రయోజనం లేకపోయింది. కారు టైరు క్రూర కూన గుండెల్ని పిండిచేసి రక్తాన్ని రోడ్డుపై చిమ్మి పదిగజాలదూరంలో ఆగింది. కారునడిపే వ్యక్తులు బ్రాందీ మత్తులో మరుగు పడిన మానవత్వం క్షణంసేపు నిద్ర మేల్కొంది. మళ్ళీ భయాందోళనతో కారుతోపాటు మాయమయింది. బండ్లూ, బస్సులూ, సైకిళ్ళూ అన్నీ...కళ్ళూ, ముక్కూ మూసుకొని పరుగెత్తిస్తూనే ఉన్నాయ్. అటు తల్లీ, ఇటు బిడ్డా! రెండు శవాల్ని చూసి కుక్క సంతోషంగా వాసన చూస్తోంది.

★